సాక్షి
చిత్తూరు
బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



తిరుమలలో రథసప్తమి సందర్భంగా సూర్యప్రభ వాహనానికి పోటెత్తిన భక్తులు (ఇన్‌సెట్‌) సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న మలయప్ప



అశేష భక్తజనం నడుమ చక్రస్నానంలో సేద తీరుతూ..



సప్తశోభితం

అంగరంగ వైభవంగా రథసప్తమి వేడుకలు

- శ్రీవారి పాదాలను తాకిన ఉషాకిరణాలు
- సప్త వాహనాలపై దర్శనమిచ్చిన మలయప్ప స్వామి
- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- రాత్రి వరకు తగ్గని రద్దీ



చిన్నశేష వాహనంపై విహరిస్తున్న స్వామివారు

తిరుమల: తిరుమలలో రథసప్తమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తుల కోలాహలం మధ్య శ్రీమలయప్పస్వామి వారు సూర్యోదయం నుంచి రాత్రి వరకు సప్త వాహనాల్లో విహరించారు. ఉత్సవం నేపథ్యంలో ఉషోదయాన ప్రాతఃకాల ఆరాధన పూర్తి కాగానే ఆలయం నుంచి వాహన మండపానికి శ్రీమలయప్పస్వామి వేంచేశారు. ఇక్కడ వజ్రకవచధారి అలంకారభూషితులై సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ తిరువీధుల్లో వాయువ్య దిశకు చేరుకున్నారు. ఉదయం ఉదయభాను కిరణాలు స్వామివారి పాదాలను తాకాయి. శ్రీవారి పాదాలపై ఉషాకిరణాలు ప్రసరించి సూర్య భగవానుడు అంజలి ఘటించారు. ఈ సమయంలో భక్తకోటి అఖండ గోవిందనామ కీర్తనలతో వేంకటాచలం ప్రతిధ్వనించింది. సూర్యప్రభ వాహనాన్ని వీడి చిన్నశేష వాహనాన్ని స్వామి అధిష్ఠించి చతుర్మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అనంతరం గరుడ, హనుమంత వాహనాలపై ఊరేగి వాహన మండపానికి వేంచేశారు. మధ్యాహ్నం శ్రీమలయప్పస్వామి ఆలయానికి చేరుకున్నారు. భారీ సంఖ్యలో భక్తులు వాహనసేవల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు.

స్వల్పంగా తోపులాటలు

వాహనసేవ గంటల వ్యవధిలోపే ముగించాల్సి ఉండడంతో వేగం కారణంగా స్వల్పంగా తోపులాటలు చోటు చేసుకున్నాయి. అయితే వాహన సేవల ముందు భక్తుల పట్ల భద్రతా సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తూ తోసివేయడంపై కొందరు అసహనం వ్యక్తం చేశారు. భారీగా అధికారులు, బోర్డు సభ్యులు కుటుంబ సభ్యులు వాహనముందు చేరడంతో వారిని పక్కకు పంపడం భద్రతా సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. రాంభగీచావద్ద భక్తులను అనుమతించకపోవడంతో పోలీసులతో స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది.

నిరంతరాయంగా అన్నప్రసాదాల వితరణ

గ్యాలరీల్లోని భక్తులకు పాలు, మజ్జిగ, అన్నప్రసాదాలను టీటీడీ నిరంతరాయంగా అందించింది. మాతృశ్రీ తరిగొండ వెంబమాంబ అన్నప్రసాద సముదాయంతో పాటు తిరువీధుల్లోని గ్యాలరీల్లోని భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, కాఫీ, మజ్జిగ అందించారు. టీటీడీ ఈవో శ్యామలారావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మణికంఠ, ఎస్పీ హర్షవర్ధన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చక్రస్నానం

శ్రీసుదర్శన చక్రతాళ్వారులు ఊరేగుతూ శ్రీవరాహస్వామి ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. సుదర్శన భగవానునికి శ్రీవారి పుష్కరిణిలో పవిత్ర స్నానం నిర్వహించారు. అనంతరం శ్రీవారు శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై ఊరేగారు. రాత్రి చంద్రోదయం సమయాన చంద్రప్రభ వాహనంపై శ్రీమలయప్పస్వామి ఒక్కరే ఊరేగి తిరిగి వాహన మండపానికి చేరుకున్నారు.



గరుడ వాహన సేవ



హనుమంత వాహన సేవ



కల్పవృక్ష వాహన సేవ



సర్వభూపాల వాహన సేవ



చంద్రప్రభ వాహన సేవలో టీటీడీ చైర్మన్, ఈఓ, అదనపు ఈఓ

న్యూస్‌రీల్

డీసీసీబీ తనిఖీ



బ్యాంకు సిబ్బందితో మాట్లాడుతున్న సీఈఓ మనోహర్‌గౌడ్

గంగాధర నెల్లూరు: జీడీ నెల్లూరు మండల కేంద్రంలోని జిల్లా సహకార సంఘం బ్యాంకు బ్రాంచ్‌ను డీసీసీబీ సీఈఓ మనోహర్ గౌడ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకులో పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. బ్యాంకు లావాదేవీలు, రుణాల రికవరీపై బ్యాంకు సిబ్బందితో చర్చించారు. రానున్న మార్చి బడ్జెట్‌కు బ్రాంచ్ లావాదేవీలు సిద్ధంగా ఉండాలని బ్యాంకు సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడీ నెల్లూరు బ్యాంకు మేనేజర్ మహేష్, సహకార సంఘం సీఈఓ విజయ్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రాంట్ ఇన్ ఎయిడ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: ఎన్‌జీఓ వలంటీర్ల ఆర్గనైజేషన్ గ్రాంట్ ఇన్ ఎయిడ్ పొందుటకు అర్హులైన వారు ఈ నెల 15 సాయంత్రం వరకు దరఖాస్తులు చేసుకోవడానికి గడువు ఉందని గిరిజన సంక్షేమ సాధికారిత జిల్లా అధికారి సూర్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌జీఓ.ట్రైబల్.జీఓవీ.ఇన్ వెబ్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అందుకు అవసరం అయిన డాక్యుమెంట్స్, సర్టిఫికెట్స్‌ను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వసతి గృహాలు, పది పడకలకు మించిన ఆస్పత్రుల ద్వారా సేవలు, వ్యవసాయం, పాడి పరిశ్రమ, పశుసంవర్ధకశాఖ తదితర రంగాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ పలువురికి జీవనోపాధి అందిస్తున్న ఆర్గనైజేషన్ వారు గ్రాంట్ ఇన్ ఎయిడ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులుగా పేర్కొన్నారు.

మార్చి 3 నుంచి ఎఫ్‌ఏ-4 పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మార్చి 3వ తేదీ నుంచి ఫార్మేటివ్ అసెస్‌మెంట్-4 పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పరీక్షల షెడ్యూల్ జారీ చేశారు. ఆ షెడ్యూల్ మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో మార్చి 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అధికారమే పెట్టుబడి..
దోపిడీనే రాబడి

కాణిపాకం ఆలయంలో కూటమి నేతలకు అధికారమే పెట్టుబడి అయింది.. ఇష్టారాజ్యంగా కౌంటర్లు, పూజల పేరుతో భక్తులను అధిక ధరలతో నిలువు దోపిడీ చేస్తున్నారు. దుకాణాల ముందు ధరల పట్టికలు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇక దుకాణాలకు టెండర్లు దక్కించుకున్న వారందరూ కూటమి నేతలే..ఇంకేముందు అడిగేవారు లేరు..ఆపేవారు లేరు..ఇక టెండర్లు దక్కించున్న నేతలు రుసుం రోజుల తరబడి ఆలయ ఖాతాకు జమ చేయకుండా బకాయిలు పెట్టడం విస్మయానికి గురిచేస్తోంది. ఇంత జరుగుతున్నా ఆలయ అధికారులు వీటిపై ఉదాసీనంగా వ్యవహరించడం భక్తులను ఆందోళనకు గురిచేస్తోంది.

- కాణిపాకంలో భక్తుల నుంచి అడ్డగోలు వసూళ్లు
- కూటమి కట్టిన టెండరుదారులు
- నెలలు గడుస్తున్నా ఖాతాకు చేరని రూ. 95 లక్షల టెండర్ రుసుం
- పాదరక్ష, పూజా సామగ్రి, లగేజీ కౌంటర్లల్లో అదనపు వసూళ్లు
- ధరల పట్టికలు లేని వైనం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

కాణిపాకం : కూటమి అధికారంలోకి రాగానే దేవస్థానం చుట్టూ కూటమి నేతలు జెండాపాతారు. అడ్డగోలుగా టెండర్లు దక్కించుకున్నారు. రుసుం చెల్లింపులో అధికార జులం ప్రదర్శిస్తున్నారు. నెలలు గడుస్తున్న రూ. 95 లక్షలు బకాయిలుగానే మిగులుస్తున్నారు. వస్తువులు భద్ర పరుచు కౌంటర్లు, పూజా సామాగ్రి అమ్మకం చేసే షాపులు, ఇతరాత్ర వాటిల్లో అదనపు వసూళ్లు చేస్తున్నారు. నిర్ణీత ధరకు విక్రయించాలని, ధరలు పట్టికలు తెల్ల పేపరుతో మూసేశారు. అధికారులు అధికార పార్టీకి తలొగ్గి చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి నిత్యం 10 వేల మంది భక్తులు వస్తుంటారు. శని, ఆదివారాల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. 30 వేల మంది భక్తులు దాటుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీంతో హుండీ ఆదాయం నెల వారీగా రూ. 2 కోట్ల మేర సమకూరుతోంది. అన్నదానం, గో సంరక్షణ, ఇతర వాటికి భక్తులు రూ. లక్షల్లో విరాళాలు సమర్పిస్తున్నారు. ఈ ఆదాయం రూ. 25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వస్తోంది. దీనికి తోడు టెండర్ల ద్వారా ప్రతిసారి రూ.కోట్లల్లో ఆదాయం వస్తోంది.



బ్యాగులు భద్ర పరుచు కౌంటర్

అదనపు వసూళ్లు...

వివిధ కౌంటర్లల్లో ఆలయ అధికారులు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. వాహన పూజ వద్ద పూజా సామగ్రి అమ్మక ధరలు అధికంగా ఉన్నాయి. పూజ సామగ్రి బయట నుంచి తెచ్చుకున్న అక్కడ వారు నిరాకరిస్తున్నారు. ఇక్కడే కొనాలనే నిబంధనను పెడుతున్నారు. ఇతర పూజా సామగ్రి అమ్మకాల వద్ద కూడా రేట్లు అధికంగా పలుకుతున్నాయి. చెప్పులు భద్రపరచు కౌంటర్లలో రూ. 7 వసూలు చేస్తున్నారు. లగేజీ సేకరణలో బ్యాగుకు రూ. 20 వసూలు చేస్తున్నారు. ఇతర కౌంటర్లలో రూ. 5 బదులుగా రూ. 10 వసూలు చేస్తున్నారు. ఈ రకంగా భక్తులను దోపిడీ చేస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. ఆ కౌంటర్ల ఎదుట ధరల పట్టికలు కనిపించడం లేదు. ఈ విషయం అధికారులకు తెలిసినా అధికార పార్టీకి తలొగ్గాల్సిన పరిస్థితి ఉంది. దీంతో చేసేదీ లేక మిన్నకుండిపోతున్నారు. అయితే కూటమిలోని ఓ వర్గం మాత్రం దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఆలయ విషయంలో మరో వర్గ నేతల పెత్తనం ఏమిటని ప్రశ్నిస్తోంది. ఇలానే కొనసాగితే ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళుతామని స్పష్టం చేస్తోంది. దీనిపై ఏఈఓ ప్రసాద్‌ను వివరణ కోరగా టెండర్ల వివరాలను బహిర్గతం చేసేదానికి కుదరదన్నారు. ధరలు అధికంగా అమ్ముతున్నారంటే ఫిర్యాదులు వస్తే...చూస్తామని బదులిచ్చారు.

టెండర్లల్లో కూటమిదే పైచేయి..

కూటమి అధికారంలోకి రాగానే టీడీపీ నేతలు దేవస్థానాన్ని టార్గెట్ చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని దేవస్థానాన్ని ఆదాయ వనరుగా మార్చుకోవాలని ప్రయత్నించారు. టెండర్లకు పోటీ రావడంతో వాయిదా వేస్తూ వచ్చారు. ఈక్రమంలో టెండర్లకు వచ్చిన వాళ్లను భయబ్రాంత్రులకు గురి చేసి టెండర్ వేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనిపై పలు పత్రికల్లో కథనాలు రావడంతో అప్పటి ఈఓ పట్టెం గురుప్రసాద్ టెండర్ నిర్వహణకు పూనుకున్నారు. పూజా సామగ్రి అమ్మకాలు, వాహన పూజ, పాద రక్షక కౌంటర్, లగేజీ కౌంటర్, కొబ్బరికొట్టు తదితర వాటిని టెండర్లు పిలిచారు. ఈ టెండర్లను కూటమి నేతలే దక్కించుకున్నారు. గతేడాది అక్టోబర్ నెలలో నిర్వహించిన టెండర్ల ద్వారా 2025 సంవత్సర క్యాలెండర్, డైరీల ముద్రణ, విక్రయ లైసెన్స్‌కు రూ.32,10,000, లగేజీ భద్రపరుచు లైసెన్స్‌కు రూ.32,76,000, షాపు నెంబరు 28, 29లో క్యాంటిన్ నిర్వహణకు రూ.29,17,116 కలిపి..మొత్తం ఆలయానికి రూ. 94,03,116 ఆదాయం చేకూరింది. అలాగే పాదరక్షక కౌంటర్‌కు రూ. 25 లక్షలు, వాహన పూజకు రూ. 49 లక్షలు వరకు ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు చెబుతున్నారు. అయితే ఆయా కౌంటర్లు, షాపులను దక్కించుకున్న టెండర్ దారులు పాట రుసుంను అప్పటికప్పుడే దేవస్థాన ఖాతాకు జమ చేయాల్సి ఉంటుంది. కానీ ఇంత వరకు ఆ రుసుంను జమ చేయకుండా కొంత మంది అధికారాన్ని అడ్డంపెట్టుకుని రూ. 95 లక్షల వరకు బకాయిలు పెట్టినట్లు ఆలయ అధికారులు విస్తుపోతున్నారు. దీనిపై వారు నోరు విప్పేందుకు కూడా జంకుతున్నారు.

సాయంత్రానికి తనిఖీలు..

టెండర్, అదనపు వసూళ్లపై 'సాక్షి' ఆరా విషయం తెలియడంతో మంగళవారం సాయంత్రానికి ఈఓ పెంచల కిషోర్ తనిఖీలు మొదలు పెట్టారు. దేవాలయ దుకాణ సముదాయాల్లోని షాపులు, కౌంటర్లను పరిశీలించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొబ్బరి కాయలు కొట్టే ప్రాంతంలో డబ్బులు వసూలు చేయకూడదని సూచించారు. బుధవారం తెల్లారే సరికి ధరల పట్టికలు ఉండాలని ఆదేశించారు. అనంతరం భక్తుల అభిప్రాయాలను సేకరించారు.



భక్తులతో మాట్లాడుతున్న ఈఓ పెంచల కిషోర్

వెలుగుల రేడుకు.. నీరాజనం



కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో మంగళవారం రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం చేశారు. కల్యాణ వేదికలో సూర్యదేవునికి విశేష పూజలు, అభిషేకాలు చేయించారు. మణికంఠేశ్వరస్వామి ఆలయంలో సూర్యదేవుడికి ప్రత్యేక అభిషేకం, పూజలు జరిపించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీవరదరాజులస్వామి ఆలయంలో గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఊరేగింపులో స్వామివారు

19 నుంచి టెక్నికల్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈనెల 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్ష (లోయర్, హయ్యర్ గ్రేడ్) పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షల షెడ్యూల్ www.bre.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉన్నట్లు తెలిపారు.

అందుబాటులో ఆరోగ్య సేవలు



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ పర్వీన్‌సుల్తాన

గంగవరం : మారేడుపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నేషనల్ హెల్త్ మిషన్ సెంట్రల్ టీం నుంచి డాక్టర్ పర్వీన్ సుల్తాన తనిఖీ చేశారు. అందులో భాగంగా 104 వాహనంలో ఈసీజీ మిషన్ పనితీరును, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌కు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. టీకాల అధికారి హనుమంతరావు, వైద్యులు జానకిరావు, శిరీష, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసాద్, వైద్యాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అడవి వెదురు పట్టివేత



అధికారులు సీజ్ చేసిన వెదురు ట్రాక్టర్

పలమనేరు : పలమనేరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కీలపట్ల బీట్ కేసీపెంట అడవి నుంచి అక్రమంగా వెదురును తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానిక ఎఫ్‌ఆర్‌ఓ నారాయణ సిబ్బందితో కలసి మంగళవారం సీజ్ చేశారు. కొన్నాళ్లుగా కొందరు స్మగ్లర్లు తమకు అధికార పార్టీ అండ ఉందంటూ అడవి నుంచి వెదురును నరికి ట్రాక్టర్లతో తరలిస్తున్నారనే సమాచారంతో నిఘా పెట్టిన అధికారులు ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఈ విషయాన్ని డీఎఫ్‌ఓ భరణికి తెలియజేశామన్నారు. ఇందుకు సంబంధించి కేసీపెంటకు చెందిన శంకర అనే వ్యక్తిపై అటవీశాఖ చట్టం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్‌ఓ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



రవి మృతదేహం

బంగారుపాళెం : చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం మండలంలోని గుర్రంకొండవాండ్లలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సుబ్బరామయ్య కుమారుడు రవి(47) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సాయంత్రం గ్రామ సమీపంలోని గుంతూరు చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. స్థానికులు గుర్తించి రవిని బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

శ్రీరంగరాజపురం : మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని జిల్లా పీఆర్‌ఐ ఈఈ చంద్రశేఖర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా స్థాయి అధికారులు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేయాలని ఆదేశించినట్లు తెలియజేశారు. విద్యార్థులకు మరింత నాణ్యతగా ఆహారం అందించాలని ఉపాధ్యాయులు, వంట సిబ్బందికి సూచించారు. అలాగే విద్యార్థులకు ప్రార్థన సమావేశం వద్ద ఎండలో నిలుస్తున్నారని వారి సౌకర్యార్థం కూలింగ్ రేకులు ఏర్పాటు చేయాలని పాఠశాల ఉపాధ్యాయులు జిల్లా పీఆర్‌ఐ ఈఈ చంద్రశేఖర్‌కు విన్నవించారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి విద్యార్థులకు కూలింగ్ రేకుల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమానికి పీఆర్‌డీఈ ఆనంద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలబడినా.. నిలబడ్డారు!

వారం రోజులుగా ఆధ్యాత్మిక తిరుపతి నగరం అట్టుడికి పోయింది. తిరుపతి కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా కాలకేయకూటమి చెలరేగిపోయింది. 48 మంది కార్పొరేటర్ల బలం కలిగిన వైఎస్సార్‌సీపీ వర్గాలపై దాడికి తెగబడింది. వారి ఆస్తులను ధ్వంసం చేస్తూ అరాచకం సృష్టించింది. కుటుంబ సభ్యులను బెదిరిస్తూ భయాందోళనకు గురి చేసింది. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ అధికారులను అడ్డం పెట్టుకుని మరీ చిత్ర హింసలకు శ్రీకారం చుట్టింది. సోమవారం ఓటేయడానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లపై గూండాగిరి ప్రదర్శించింది. నలుగురు కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి కలకలం సృష్టించింది. ఆపై మంగళవారం ఓటింగ్‌లో పాల్గొన్న ఆ కార్పొరేటర్లు కన్నీళ్లు పెట్టుకోవడం వారి అరాచకాలకు నిదర్శనంగా నిలిచింది. మహిళా మేయర్, కార్పొరేటర్ల వీరోచిత పోరాటం రాష్ట్ర ప్రజానీకానికి ఆదర్శంగా నిలిచింది.

- కళ్లెదుటే అరాచకం సృష్టిస్తున్నా అదరలేదు, బెదరలేదు
- వీర సైనికులనిపించుకున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు
- కూటమి గూండాలను ఎదిరించిన మహిళా కార్పొరేటర్లు
- దొడ్డిదారిలో డెప్యూటీని లాక్కున్నా నైతిక విజయం వైఎస్సార్‌సీపీదే
- వారం రోజులపాటు కూటమి గూండాలు వెంటాడినా చివరకు ఓటేశారు!



భూమన కరుణాకరరెడ్డితో ఎంపీ, మేయర్, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కాలకేయ కూటమికి ఎదురొడ్డి పోరాడారు. నగరంలో వారం రోజులుగా కూటమి గూండాల అలజడులు.. అల్లర్లతో భయానక వాతావరణాన్ని సృష్టించారు. కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసినా.. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు అదరలేదు.. బెదరలేదు. తాము ప్రయాణిస్తున్న వాహనాన్ని సుమారు 500 మంది గూండాలు అడ్డుకుని రాడ్లు, రాళ్లతో దాడులకు తెగబడుతున్నా చింతించలేదు. ముఖ్యంగా మహిళా కార్పొరేటర్లు ఎదిరించి వీరోచిత మహిళలనిపించుకున్నారు. పోలీసులు, రెవెన్యూ, కార్పొరేషన్, కిరాయి రౌడీలందరినీ ఉపయోగించినా కుట్రలు పారలేదు.

కూటమి అరాచకాలకు ఆ కన్నీళ్లే సాక్ష్యం

తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నికలు ముగిశాక కిడ్నాప్‌నకు గురైన వైఎస్సార్‌సీపీకి చెందిన నలుగురు కార్పొరేటర్లు, ఎమ్మెల్సీ తిరిగి భూమన కరుణాకరరెడ్డి నివాసానికి విచ్చేశారు. జరిగిన తీరును వివరించారు. తమపై భౌతిక దాడులు చేస్తూ, ఆస్తులు విధ్వంసానికి పాల్పడిన నరకం చూపించారని అనీష్‌రాయల్ కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం భూమన కరుణాకరరెడ్డి కాళ్లపై పడి క్షమించమని వేడుకున్నారు. అనీష్ ఆవేదనను అర్థం చేసుకున్న భూమన కన్నీరు పెట్టుకోవడం చూసి కార్పొరేటర్లంతా భావోద్వేగానికి లోనయ్యారు. భవిష్యత్‌లో అంతా కలసికట్టుగా పనిచేయడానికి వేదికగా మారిందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభిప్రాయపడ్డారు.

నైతిక విజయం వైఎస్సార్‌సీపీదే

కూటమి నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా దిగజారుడు రాజకీయాలకు ఒడిగట్టారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కొందరిని అధికారబలంతో బెదిరించి, భయపెట్టి ప్రలోభాలకు గురిచేశారు. దొడ్డిదారిలో డెప్యూటీ మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారు. కానీ నైతిక విజయం మాత్రం వైఎస్సార్‌సీపీదేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఆదరిస్తూ..అండగా నిలుస్తూ!



ఎంపీ గురుమూర్తి, అభినయ్ ఆత్మీయ ఆలింగనం

వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయరెడ్డి కార్పొరేటర్లకు, వారి కుటుంబ సభ్యులకు అండగా నిలబడడాన్ని పలువురు ప్రసంసిస్తున్నారు. వారం రోజుల పాటు వారిని సురక్షితంగా తన నివాసానికి తీసుకొచ్చారు. ఆపై వారి కుటుంబాలకు అండగా నిలిచారు. దాడులు, ప్రతి దాడులను ఎప్పటికప్పుడు ప్రతిఘటించారు. అదేవిధంగా మేయర్ డాక్టర్ శిరీష మహిళే అయినా.. గూండాలు ఎదురొచ్చి దాడులు చేస్తున్నా అధైర్యపడలేదు. మహిళా కార్పొరేటర్లకు ధైర్యం చెబుతూ వీరోచితంగా పోరాడారు. మరో కార్పొరేటర్ ఆరణి సంధ్య మహిళా కార్పొరేటర్లను సమన్వయం చేసుకుంటూ కూటమి నేతల బెదిరింపు కాల్స్‌ను తిప్పికొట్టారు. ఇలా ప్రతి మహిళా కార్పొరేటర్ తమదైన శైలిలో పోరాడి అభినందనలు అందుకున్నారు.

పోరాట యోధులు మహిళా కార్పొరేటర్లు

- భూమన ప్రశంస



డెప్యూటీ మేయర్ ఎన్నికకు వెళుతున్న మేయర్ శిరీష, ఎంపీ గురుమూర్తితో మహిళా కార్పొరేటర్లు

తిరుపతి మంగళం: తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమి నేతల అరాచకాలను, బెదిరింపులను, విధ్వంసాలను ఎదుర్కొంటూ వీరోచిత పోరాటం చేసిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు దేశానికే ఆదర్శంగా నిలిచారని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డిలు ప్రశంసించారు. డెప్యూటీ మేయర్ ఎన్నికలో ఎలాగైనా గెలుచుకోవాలన్న దురాలోచనతో గత వారం రోజులుగా తిరుపతిలో కూటమి నేతలు చేస్తున్న అరాచకాలు అన్నీ ఇన్నీ కావన్నారు. అందులో కొంతమంది వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను బెదిరించి, భయపెట్టి లోబరుచుకున్నా అధిక శాతం వైఎస్సార్‌సీపీలోని మహిళా కార్పొరేటర్లు నీతి, నిజాయితీగా వైఎస్సార్‌సీపీ వైపే నిలబడ్డారని ప్రశంసించారు. వణుకు బెణుకు లేకుండా కూటమి కుట్రలను వీరోచితంగా ఎదుర్కొని వీర మహిళలుగా నిలిచారని తెలిపారు.

బలమనుకోవద్దు!



“తిరుపతి నగర మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో నైతిక విజయం వైఎస్సార్‌సీపీదే. టీడీపీకి చెందిన ఒకే ఒక కార్పొరేటర్‌తో డెప్యూటీ మేయర్ స్థానాన్ని ఎలా దక్కించుకోగలుగుతారు..? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికార బలం, దాడులు, ఆస్తుల ధ్వంసం, అక్రమ కేసులు, కిడ్నాప్‌లతో లోబరుచుకున్నారు. టీడీపీ గెలుపు చూసి తాము బలంతో గెలిచాం అనుకుంటున్నారు. ప్రజాకోర్టులో కూటమి ప్రభుత్వం ఓడిపోయింది. – డాక్టర్ ఎం.గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

ప్రజాస్వామ్యం ఖూనీ



తిరుపతి నగర పాలక సంస్థ ఉప మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఓటమి ప్రజాస్వామ్య ఓటమి. ఎన్నికల్ల తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డా శిరీషా విధుల నిర్వహణలో అవమానించారు. కార్పొరేషన్ సమావేశం లోపల జరుగుతుంటే బయట మేయర్ ఆందోళన చేసే పరిస్థితి ఏర్పడింది. ఒక్క ఓటు ఉన్న కార్పొరేటర్ గెలవడమేంటి. మేము ఓడిపోలేదు. వ్యవస్థల ఉదాసీన వైఖరి, అధికార దుర్వినియోగం గెలిచింది. – ఆర్కే రోజా, మాజీ మంత్రి

దుర్మార్గపు పాలన



ఏడాది కాలం డెప్యూటీ మేర్ పదవి కోసం కూటమి నేతలు కాలకేయుల్లా వ్యవహరిస్తున్నారు. మహిళా కార్పొరేటర్ల పట్ల టీడీపీ, జనసేన నేతలు వ్యవహరించిన తీరు అభ్యంతరకరం. దౌర్జన్యాలతో డిప్యూటీ మేయర్‌ను అక్రమంగా గెలుచుకున్నారు. ఇది వారి గెలుపుగా భావిస్తే అంతకంటే దిగజారుడుతనం మొరకటి ఉండదు. కార్పొరేటర్లపై దాడులు చేయడం సిగ్గుచేటు. వైఎస్సార్‌సీపీకి అండగా నిలబడిన కార్పొరేటర్లకు అభినందనలు. – డాక్టర్ ఆర్.శిరీష, తిరుపతి నగర మేయర్

ఆర్‌కేఎంపురం హైస్కూల్‌కు హరిత పురస్కారం



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు రవి

వెదురుకుప్పం : మండలంలోని మాంబేడు పంచాయతీ ఆర్‌కేఎం పురం జెడ్పీ హైస్కూల్‌కు హరిత పురస్కారం రెండోసారి దక్కడంతో జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఇటీవల ఢిల్లీలో నేషనల్ గ్రీన్ కోర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఎస్‌ఈ డైరెక్టర్ సునీత నరేన్ ద్వారా ఈ అవార్డును పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు వైవీపీ రవికి అందజేశారు. పాఠశాలలో విద్యతో పాటు పర్యావరణ కార్యక్రమాల్లో పాలుపంచుకుని పాఠశాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దినట్లు ప్రధానోపాధ్యాయురాలు దేశమ్మ తెలిపారు. పచ్చని చెట్ల మధ్య బోధన, పర్యావరణ హితంగా పాఠశాల రూపుదిద్దుకున్నట్లు చెప్పారు. దీంతో 2024–25 విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయిలో హరిత పాఠశాలగా రెండోసారి ఎంపికైనట్లు తెలిపారు. దీనిపై రాష్ట్ర ఎన్‌జీసీ డైరెక్టర్ స్రవంతి, డీఈఓ వరలక్ష్మి, డీవైఈఓ చంద్రశేఖర్, ఎంఈఓలు మహేశ్వరరావు, దామోదరం పాఠశాల ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు.

అంటు విధానంతో అధిక దిగుబడులు



మొక్కలకు అంటు కడుతున్న వ్యవసాయాధికారులు

కుప్పంరూరల్ : భవిష్యత్తు సాగు పద్ధతులు అంటు కట్టు విధానంపై ఆధారపడి ఉంటుందని ఇండో ఇజ్రాయిల్ ప్రాజెక్టు ఎంబసీ బ్రహ్మదేవ్ పేర్కొన్నారు. కుప్పం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో జరుగుతున్న రైతు జాతీయ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. అంటు కట్టు విధానంలో చేపట్టే కూరగాయలు, పూల సాగు వల్ల అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. చాలా దేశాలు హైడ్రో ఫోనిక్స్ (మట్టి లేకుండా కూరగాయల పెంపకం) చేపడుతున్నాయని, వాటితో పోటీ పడాలంటే వ్యవసాయంలో కొత్త రకాలతో పాటు సాంకేతికతను అనుసంధానం చేసుకోవాలన్నారు. అనంతరం దేశం నలుమూలల నుంచి వచ్చిన వ్యవసాయ, ఉద్యాన అధికారులు, రైతులకు మొక్కలు అంటు కట్టు విధానం గురించి ఏడీ కోటేశ్వరరావు వివరించారు. వారిచే మొక్కలు అంటు కట్టే విధానం చేయించారు. తరువాత గంగవరం మండలంలోని హైడ్రోఫోనిక్స్‌ను సందర్శించారు. ఉద్యాన అధికారులు డింపు ప్రియ, వింధ్య, అధికారులు, రైతులు ఉన్నారు.

పదోన్నతి పొందిన అధికారులకు పోస్టింగ్‌లు

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని ట్రాన్స్‌కో పరిధిలో పదోన్నతి పొందిన అధికారులకు పోస్టింగ్స్ ఇస్తూ సీఎండీ సంతోషరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా స్టోర్స్ డీఈగా ఉన్న ఎ.బాలాజీ పదోన్నతిపై ఈఈగా కార్పొరేట్ కార్యాలయ క్వాలిటీ కంట్రోల్ విభాగానికి బదిలీ అయ్యారు. స్టోర్స్ డీఈగా కార్పొరేట్ కార్యాలయ పీఅండ్ ఎంఎం విభాగ డీఈ వసంతనాయుడును నియమించారు. ఐరాల రూరల్స్ ఏఈ ఎస్.బాలాజీ పదోన్నతిపై డీఈగా పుటపర్తి డివిజన్‌కు బదిలీ చేశారు. వీరు త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

గీత కార్మికుల మద్యం దుకాణాలకు 11 దరఖాస్తులు



గీత కార్మిక సంఘాలతో మాట్లాడుతున్న డీసీ విజయశేఖర్

చిత్తూరు అర్బన్ : కల్లుగీత సామాజిక వర్గాలకు చెందిన వారికి కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి బుధవారంతో గడువు ముగియనుంది. గీత కులాలకు చెందిన వారికి జిల్లాలో పది మద్యం దుకాణాలు రిజర్వు చేస్తూ గతనెల అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇప్పటి వరకు 11 దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అధికారులకు అందాయి. 5వ తేదీ సాయంత్రం 5 గంటలతో దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు గడువుగా అధికారులు ఇప్పటికే ప్రకటించారు. 6వ తేదీ దరఖాస్తుల పరిశీలన.. 7వ తేదీ ఉదయం 10 గంటలకు దరఖాస్తులను చిత్తూరులోని దొడ్డిపల్లె సమీపంలో ఉన్న చిత్తూరు సహకార చక్కర ఫ్యాక్టరీ కల్యాణ మండపంలో లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు జరగనుంది. ఆ మరుసటి రోజు నుంచే లైసెన్సులు కేటాయించి, మద్యం దుకాణాల నిర్వహణకు అనుమతి ఇస్తారు. దుకాణం వచ్చిన వారు అన్-రిజర్వు దుకాణాలతో పోలిస్తే 50 శాతం మాత్రం లైసెన్సు ఫీజుగా చెల్లిస్తే సరిపోతుంది. కాగా మంగళవారం చిత్తూరులోని అర్బన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ కల్లు గీత సంఘాలతో సమావేశమయ్యారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు దుకాణాలకు దరఖాస్తుకోవాలని కోరారు. ఏదైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేస్తామన్నారు. సమావేశంలో ఏఈఎస్ కృష్ణకిషోర్ రెడ్డి, సీఐలు శ్రీహరిరెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

పలమనేరు-కుప్పం రయ్..రయ్

- నాలుగు లేన్ల రహదారిగా మారనున్న వైనం
- రూ.1500 కోట్లతో చతుర్ముఖ ప్రణాళిక
- మొత్తం ఐదుచోట్ల బైపాస్‌ల నిర్మాణం



ఫోర్‌లైన్‌గా మారనున్న పలమనేరు- కుప్పం రహదారి

పలమనేరు : ఇప్పటి దాకా డబుల్ రోడ్డుగా ఉన్న పలమనేరు-కుప్పం రహదారి నాలుగులేన్ల రహదారిగా మారనుంది. పలమనేరు సమీపంలోని చెన్నై- బెంగళూరు హైవేను తాకుతూ క్యాటిల్‌ఫామ్ నుంచి కుప్పం సమీపంలోని తమిళనాడు సరిహద్దు వరకు 84 కిలోమీటర్ల మేర దీన్ని నిర్మించనున్నారు. ఆ మేరకు పనులకు సంబంధించి రూ.1500 కోట్లతో రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ అంచనా వేసినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. దీని డీపీఆర్ కోసం ప్రస్తుతం సర్వే సాగుతోంది.

నియోజకవర్గంలోని మండల కేంద్రాలైన బైరెడ్డిపల్లి, వీకోటలలో బైపాస్ రోడ్ల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. బైరెడ్డిపల్లిలో ఆరు కిలోమీటర్ల బైపాస్ రహదారికి భూసేకరణ, అభ్యంతరాలు, ఆక్షేపణలు పూర్తయ్యాయి. వీకోటలో పది కిలోమీటర్ల బైపాస్‌కు అలైన్‌మెంట్ మార్పు విషయంగా నెలకొన్న గందరగోళం, కోర్టు వ్యాజ్యం కారణంగా ఎల్‌ఏతో నిలిచింది. ఈ రెండు చోట్ల బైపాస్‌ల నిర్మాణం కోసం గత ప్రభుత్వంలో రూ.70 కోట్లు మంజూరై ఆపై అంచనాలు పెరిగి ఇప్పుడు వందకోట్లు అయింది.

కొత్తగా మరో మూడు బైపాస్‌లు

ఫోర్‌లైన్ రోడ్డు కారణంగా రాజుపేట రోడ్డు, శాంతీపురం, అక్కడి నుంచి కుప్పం మధ్యలో ఓ చోట మొత్తం మూడు బైపాస్‌లను నిర్మించనున్నారు. ఈ బైపాస్‌లకు భూసేకరణ పూర్తయితే ఆపై పనులు ప్రారంభం కానున్నాయి.

15 గ్రామాల్లో రోడ్డు విస్తరణ.

డబుల్ రోడ్డుగా ఉండి ఇప్పుడు ఫోర్‌లైన్‌గా మారనున్న నేపథ్యంలో రోడ్డు విస్తరణ, సోల్డర్ల పెంపు కచ్చితంగా జరుగుతుంది. దీంతో ఈ మార్గంలోని నక్కపల్లి, గొల్లపల్లి, కొలమాసనపల్లి, దుగ్గినవారిపల్లి, కూర్మాయి, బేలుపల్లి క్రాస్, సాకేవూరు, చీలంపల్లి, దేవదొడ్డి, కస్తూరినగరం, తోటకనుమ, పత్రపల్లి, చెల్దిగానిపల్లి, తుమిసి, ఏడోమైలు తదితర గ్రామాల వద్ద రోడ్డుకిరువైపులా భవనాల తొలగింపులు జరగనున్నాయి. ఈ రోడ్డు ఫోర్‌లైన్‌గా మారితే ఏపీ నుంచి తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు రాకపోకలు రయ్..రయ్ మనడం ఖాయం.

ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా చేపట్టాలి

- నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- ఎలాంటి తప్పిదాలు చోటు చేసుకోకూడదని ఆదేశాలు
- సమీక్షలో డీఆర్‌ఓ మోహన్‌కుమార్ వెల్లడి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ మోహన్‌కుమార్, సమావేశానికి హాజరైన అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌ఓ మోహన్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు పలు శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం వరుస సమీక్షలు నిర్వహించారు. జిల్లాలో నేటి నుంచి 20 వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు పక్కాగా నిర్వహించాలన్నారు. ఎలాంటి చిన్న తప్పిదాలు చోటు చేసుకునేందుకు వీల్లేదని స్పష్టం చేశారు. జిల్లాలోని 69 (ఒకేషనల్‌తో కలిపి) మూడు విడతల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

ఈ పరీక్షలకు ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి చెందిన 12,311 మంది పాల్గొంటారని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు సకాలంలో ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో డీవీఈఓ సయ్యద్‌మౌలా, స్పెషల్ ఆఫీసర్ దయానందరాజు, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం రాజు, నిర్మలా కుమారి, హేమలత, శరత్‌చంద్ర, పాఠశాల విద్యాశాఖ డీవైఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

5న ఎన్‌డీఆర్‌ఎఫ్ మాక్‌డ్రిల్

జాతీయ విపత్తు ప్రతి స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 5న యాదమరి ఐటీసీఎల్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తారని డీఆర్‌ఓ మోహన్‌కుమార్ తెలిపారు. ఈ మాక్‌డ్రిల్ నిర్వహణపై పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విపత్తు పరిస్థితుల్లో ఎన్డీఆర్‌ఎఫ్ పాత్ర కీలకమన్నారు. అనుకోకుండా వచ్చే విపత్తుల నుంచి ఎలా బయటపడాలి అనే విషయాలను మాక్‌డ్రిల్ లో ప్రదర్శిస్తారన్నారు. అనుకోని విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ముందస్తుగా అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మాక్‌డ్రిల్ కు సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. సమావేశంలో డిజాస్టర్ మేనేజ్మెంట్ డిప్యూటీ కలెక్టర్ అనుపమ, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ అనితా సదన్, జిల్లా వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీ కృష్ణ, డాక్టర్ ప్రభాకర్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహాలకు పూర్వవైభవం

- రూ.9 కోట్లతో భవనాలకు మరమ్మతులు
- డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య వెల్లడి



కార్వేటినగరం ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య

కార్వేటినగరం : ప్రభుత్వ వసతి గృహాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల మరమ్మతులకు రూ.8.60 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. దీంతో పాటు ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్ అందించిన రూ.40 లక్షలతో కలిపి రూ. 9 కోట్లతో వసతి గృహాలకు మరమ్మతులు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఇందులో భాగంగా కార్వేటినగరంలోని ఇంటిగ్రేడ్ వసతి గృహానికి రూ.60 లక్షలు, ఎస్సీ బాలికల వసతి గృహానికి రూ.40 లక్షలు, అదే విధంగా సుబ్రహ్మణ్య స్వామి ఆలయ సమీపంలోని ఎస్సీ కళాశాల వసతిగృహం ఆధునీకరణకు రూ.18.50 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని నాణ్యతతో పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహాల్లో మమ్మతులకు గురైన మరుగుదొడ్లు, పెచ్చులూడుతున్న పైకప్పులు, కిటికీలు ఈ నిధులతో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత వార్డన్లపై ఉందన్నారు. ఆయన వెంట ఈఈ మురళీధర్‌రెడ్డి, ఏఈ సుబ్రమణ్యంరెడ్డి, ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీనివాసులు, వార్డన్లు హేమలత, ధశరధన్, సుబ్బరత్న సిబ్బంది ఉన్నారు.

వేసవిలో అంతరాయంలేని విద్యుత్

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్ : వేసవి సమీపిస్తున్న సమయంలో అంతరాయం లేని విద్యుత్ ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. మంగళవారం ఎస్‌ఈ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అప్పుడే ఎండ ప్రభావం తెలుస్తోందన్నారు. ఇక త్వరలో విద్యుత్ వాడకం పెరగనుందన్నారు. అందుకు తగ్గినట్లు సబ్‌స్టేషన్ల వారీగా అవసరమైన మరమ్మతు పనులు చేయించాలన్నారు. ఎస్‌పీఎంల నందు సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు చేసి పంపాలన్నారు. ఏ సెక్షన్ల నందు లోడ్ అధికంగా ఉంది వాటి నియంత్రణకు అవసరమైన చర్యలను ఈఈలకు ఏఈలు నివేదించాలన్నారు. అదే విధంగా సిబ్బంది త్రీ కటింగ్ చేస్తూ లైన్‌లాస్ రాకుండా చూడాలన్నారు. నిల్వ ట్రాన్స్‌ఫార్మర్లు ఎస్‌పీఎంలో లేకపోవడంతో కడప నుంచి వంద తెప్పిస్తున్నామన్నారు. జిల్లాలో జీడీ నెల్లూరులో నియోజకవర్గంలో 2, కుప్పంలో 6 సబ్‌స్టేషన్ పనులు జరుగుతున్నాయన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని శాఖాపరంగా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. సబ్‌స్టేషన్ల నందు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, సురేష్, శ్రీనివాసమూర్తి, జగదీష్, వాసుదేవరెడ్డి, అమర్‌బాబు, ఏఓ ప్రసన్న ఆంజనేయులు, డీఈ రవి, ఏఈలు పాల్గొన్నారు.